సాక్షి నాగర్‌కర్నూల్

గురువారం : 29 : జూన్ : 2023



'ఇండోర్' పనులు ముమ్మరం

పాలమూరులో ఇండోర్ స్టేడియం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

వివరాలు 8లో ▸



చెంచుల జీవనంపై అధ్యయనం

ఎన్ఐఆర్‌డీ శిక్షకుల బృందం చెంచుల జీవన స్థితిగతుల గురించి తెలుసున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.5 /22.4

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇన్‌స్పైర్ నామినేషన్లకు దరఖాస్తుల స్వీకరణ

కందనూలు: విద్యార్థుల్లో శాస్త్రీయతను వెలికితీసి వారిని బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశమున్న ఇన్‌స్పైర్ నామినేషన్లు ఆగస్టు 31లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల నుంచి 5 నామినేషన్లు తప్పక నమోదు చేయాలని, సంబంధిత ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల నుంచి సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందించడానికి సైన్స్, గణిత శాస్త్రాల ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఆ దిశగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి (9989921105)ని సంప్రదించాలని తెలియజేశారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

కోడేరు: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్‌సీఓ వెంకట్‌రెడ్డి తెలిపారు. గురుకుల పాఠశాలలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సామాన్య, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, ఎకనామిక్స్ బోధించేందుకు పీజీ, బీఈడీ విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 3 లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదే విధంగా నాగర్‌కర్నూల్ ఉయ్యాలవాడ బీసీ గురుకుల బాలికల పాఠశాలలో గణితం, సాంఘిక శాస్త్రం, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్, కల్వకుర్తి బీసీ బాలికల పాఠశాలలో హిందీ, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, సామాన్యశాస్త్రం ఖాళీగా ఉన్నాయని, అభ్యర్థులు జూలై 3 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



అచ్చంపేట రూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన బక్కలింగాయపల్లి, అక్కారం, సిద్ధాపూర్, బొమ్మన్‌పల్లిలో పోలింగ్ బూత్‌లను బుధవారం ఆర్డీఓ పాండునాయక్, తహసీల్దార్ కృష్ణయ్య పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం, భద్రత, వివిధ సౌకర్యాలను పరిశీలించారు. త్వరలో కొనసాగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్నామని ఆర్డీఓ తెలియజేశారు.


నేడు డయల్ యువర్ డీఎం

కందనూలు: నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో పరిధిలోని పరిసర గ్రామాల ప్రయాణికుల సౌకర్యం కోసం గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా తనతో నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడవచ్చని డీఎం ధరమ్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, ఆర్టీసీ వేళలో మార్పులు, ఇతర సౌకర్యాల గురించి తమ సలహాలు, సూచనలు స్వీకరస్తామని పే ర్కొన్నారు. 9959226288 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతులు తొందరపడొద్దు..

వచ్చేనెల 15 వరకు పత్తిసాగుకు సమయం

- నీటి వసతి ఉంటే వరి నార్లు పోసుకోవచ్చు
- మొలకశాతం కట్టిన తరువాతే విత్తనాలు నాటండి
- విత్తన, ఎరువుల డీలర్లతో ఖచ్చితంగా రశీదులు పొందాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమంలో రైతులతో డీఏఓ వెంకటేశ్వర్లు



నాగర్‌కర్నూల్: రైతులు పత్తి విత్తనాలు నాటేందుకు తొందరపడొద్దని, వచ్చే నెల 15 వరకు పత్తి విత్తనాలు నాటుకోవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. వర్షాలు పడిన తరువాత పత్తి విత్తనాలు వేసుకోవాలన్నారు. రైతులు నేరుగా విత్తనాలు నాటే ముందు మొలక శాతం కట్టాలని, అందులో వచ్చిన మొలకల శాతాన్ని బట్టి విత్తనాలు నాటుకోవచ్చని, లేదంటే డీలర్లకు విత్తనాలు వాపస్ ఇవ్వొచ్చన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనే డీలర్ల వద్ద ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలన్నారు. రైతు వేదికల్లోని ఏఈఓలతో కలిసి సలహాలు, సూచనలు తీసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా జిల్లాలోని రైతులకు సాగులో సందేహాలను నివృత్తి చేసేందుకు, సలహాలు అందించేందుకు బుధవారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో ఆయన రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

■ ప్రశ్న: ప్రస్తుతం వర్షాలు కురవడం లేదుకదా, పత్తి విత్తనాలు ఎప్పుడి వరకు నాటుకోవచ్చు?.

– సయ్యద్, ఉప్పునుంతల

→ డీఏఓ: జిల్లాలో నైరుతి రుతు పవనాలు కాస్త ఆలస్యంగానే ప్రవేశించాయి. సాగునీటి సౌకర్యం ఉన్న రైతులు వరిని, పత్తిని నాటుకోవచ్చు. పత్తిని జూలై 15వరకు నాటుకోవచ్చు. ఇంకా నీటిని తక్కువగా ఉపయోగించే పత్తి, ఇతర నూనె గింజల పంటలు సాగు చేయడం ఉత్తమం. ప్రస్తుతం జిల్లాలో అన్ని ప్రైవేటు డీలర్ల వద్ద అన్ని రకాలు విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

■ ప్రశ్న: భూసార పరీక్షలు నిర్వహించడంలో ఉపయోగం ఉందా? ఈ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారు.

– మహేష్, సుద్దకల్ గ్రామం, కల్వకుర్తి మండలం

→ డీఏఓ: భూసార పరీక్షలను మే నెలలో శాంపిల్స్ సేకరించి జడ్చర్లలోని భూసార పరీక్ష కేంద్రంలో చేస్తారు. పరీక్షల అనంతరం వారు ఇచ్చిన ఫలితాన్ని బట్టి పంటలను సాగు చేసుకోవచ్చు. భూసార పరీక్షలతో భూమిలో ఉండే లవణాల శాతం, ఏ పంటకు అనుకూలంగా ఉంటుందో తెలుస్తుంది. ఈ పరీక్షలతో రైతులకు అన్ని విధాల లాభం చేకూరుతుంది.

సాక్షి ఫోన్ ఇన్

■ ప్రశ్న: ఎకరం పొలంలో జొన్న పంటను వేశాం. దీనికి పురుగు పట్టింది నివారణకు ఏం చేయాలి.

– రవి, పెద్దతండా, బిజినేపల్లి మండలం.

→ డీఏఓ: జొన్న పంటలో పురుగు పట్టడం సాధారణంగా జరుగుతుంది. దీనికి ఏసీఫేట్, క్లోరోఫైర్‌ఫాస్ మందులను స్ప్రే చేస్తే జొన్న పంటను కాపాడుకోవచ్చు. అయితే ఈ మందులను నీం ఆయిల్‌తో కలిపి కొట్టాల్సి ఉంటుంది. ఇలా చేస్తే పురుగు రాకుండా ఉంటుంది.

■ ప్రశ్న: 15048 బీపీటీ వరి విత్తనాలను వేశాం. వరి నాట్లకు తెగులు వచ్చింది, దీన్ని ఎలా నివారించాలి?

– జంగయ్య, వెల్దండ

→ డీఏఓ: వరికి సంబంధించిన నారు పెంచుకునే సమయంలోనే కొంత జాగ్రత్తలు తీసుకోవాలి. నారు సమయంలోనే సీ–ట్రీట్‌మెంట్ ఇవ్వాలి. దీంతో నారుకు ఎలాంటి రోగాలు రాకుండా ఉంటాయి. ప్రస్తుతం వచ్చిన తెగులుకు సుడమోనస్ అనే కెమికల్‌ను వాడితే బాగుంటుంది. ప్రతి మంగళవారం, శుక్రవారం రైతు వేదికల్లో నిర్వహించే సమావేశాలకు హాజరై సలహాలు, సూచనలు తీసుకోవాలి.

■ ప్రశ్న: పత్తిమొక్కలు ఎర్రబారుతున్నాయి, దీన్ని నివారించడం ఎలా?

– శ్రీనివాస్, గౌరారం.

→ డీఏఓ: కొన్ని రోజులుగా వర్షాలు కురవకపోవడంతో పత్తి మొక్కలు ఎర్రబారుతున్నాయి. భూమిలో పోషక విలువలు తగ్గడమే ఇందుకు కారణం. జింక్, బోరాన్, మెగ్నీషియం తదితర మిశ్రమాలున్న మైక్రో న్యూటియెంట్స్ స్ప్రే చేస్తే పంటను కాపాడుకోవచ్చు.

■ ప్రశ్న: నాలుగు రోజుల కిందట పత్తి విత్తనాలు నాటినా మొలకెత్తలేదు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవచ్చా?

– లక్ష్మణ్, కార్వంగ

→ డీఏఓ: పత్తి పంటను వచ్చే నెల 15 వరకు వేసుకోవచ్చు. పత్తి విత్తనాలు నాటే ముందు మొలక శాతాన్ని కట్టాలి. పత్తి విత్తనాల ప్యాకెట్ నుంచి ఓ వంద విత్తనాలు తీసి మొలక శాతాన్ని కట్టాలి. మూడు రోజుల తరువాత వచ్చిన మొలకల శాతాన్ని బట్టి విత్తనాలు నాటాలా లేక డీలర్‌కు వాపస్ ఇవ్వాలా? అనే విషయం అర్థమవుతుంది. విత్తనాలు తీసుకునే డీలర్ వద్ద ఖచ్చితంగా రశీదు తీసుకోవాలి

■ ప్రశ్న: కేఎల్ఐ నీరువచ్చిందనే సంతోషం ఉన్నా... ఈ కాల్వ నీటితో పొలాల్లో జమ్ము పేరుకుపోతుంది. జమ్మును ఎలా నివారించాలి.?

– కొత్త రవీందర్ రావు, పెద్దాపురం, ఉప్పునుంతల మండలం

→ డీఏఓ: కాల్వలో నీరు ఎక్కువగా పారడంతో జమ్ము రావడం సహజమే. దీనికి దమ్ము చేసి సూపర్ పాస్పెట్ వేస్తే సరిపోతుంది. దీంతో జమ్ము మొత్తం కుళ్లిపోతుంది. ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటనలకు వచ్చినప్పుడు వారికి సమస్యను చూపించి వారి సలహా తీసుకోవచ్చు.

■ ప్రశ్న: వర్షాకాలంలో ఏ పంటలు సాగు చేస్తే లాభదాయకం. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా విత్తనాలు ఏమైనా అందజేస్తుందా?

– ఖాజా, జటప్రోల్, పెంట్లవెల్లి

→ డీఏఓ: నీటి వసతులు ఉండి జాలెత్తి పొలాలు ఉంటే వరి సాగు చేసుకోవచ్చు. దీంతో పాటు పత్తి, మొక్కజొన్న, పుప్పధాన్యాలైన మినుములు వంటివి కూడా సాగు చేసుకోవచ్చు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఎలాంటి విత్తనాలు ఇవ్వడం లేదు. అన్ని రకాల విత్తనాలు ప్రైవేటు డీలర్ల వద్దనే దొరుకుతాయి. దీంతోపాటు సింగిల్‌విండోలో కొన్నిచోట్ల అందుబాటులో ఉన్నాయి.

■ ప్రశ్న: రైతులకు వాతావరణ సూచనలు ఇచ్చే అవకాశం ఉందా? ఇటీవల కొందరికి రైతుబంధు పడలేదు కదా కారణం ఎంటీ?

– గౌతం, వంగూరు

→ డీఏఓ: వాతావరణ శాఖ వారిచ్చిన సమాచారాన్ని రైతులకు గ్రూపుల ద్వారా షేర్ చేస్తున్నాం. రైతువేదికల పరిధిలో వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి దాని ద్వారా సమాచారాన్ని అందజేస్తున్నాం. రెవెన్యూలో ఏదైనా సమస్య ఉంటేనే తప్ప రైతుబంధు రాకుండా ఉండదు. మాకు వచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేస్తున్నాం.

డీవైఎస్‌ఓ బాధ్యతల స్వీకరణ



కందనూలు: జిల్లా యువజన, క్రీడల శాఖ నూతన అధికారిగా వి.సీతారామ్ బుధవారం జిల్లా కేంద్రంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ ఉదయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలువురు అధికారులు, ఉపాధ్యాయులు నూతన అధికారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

మ్యాంగో క్లస్టర్ తొలి ఏకాదశి కానుక



కందనూలు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉమ్మడి పాలమూర్ జిల్లా ప్రజలకు తొలి ఏకాదశి కానుకగా మ్యాంగో క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తుందని బీజేపీ సీనియర్ నాయకుడు సుధాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రూ.100 కోట్లతో 15 ఎకరాల్లో కోల్డ్ స్టోరేజీలు, బ్యాక్ హౌజ్‌లు, మామిడి పండ్ల మార్కెట్, ఎక్స్‌పోర్ట్ హబ్‌లను ఈ ప్రాంతం మామిడి రైతుల కోసం ఏర్పాటు చేయడం హర్షనీయన్నారు. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రాండ్ చార్టర్ ఏజెన్సీ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లో పర్యటిస్తారని చెప్పారు. ఇక్కడ పండిస్తున్నటువంటి మామిడి తోట రకాలు ఎన్ని, ఎన్ని ఎకరాల్లో పండిస్తున్నారు, ఎంత మంది మామిడి రైతులు ఉన్నారనే వివరాలతో పాటు ఇంకా ఏమైన నర్సరీలు అవసరం, అందులో హైటెక్ నర్సరీలు ఎన్ని అవసరమవుతాయి అనే రిపోర్టును తయారు చేసుకుంటారని పేర్కొన్నారు. దీని ఏర్పాటుతో 5 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ మామిడి క్లస్టర్ దేశంలోనే అత్యంత పొడవైన 44 నంబర్ జాతీయ రహదారి పక్కన భూత్పూర్, జడ్చర్ల ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నారని తెలియజేశారు.

ఔట్‌సోర్సింగ్ లీలలపై చర్చ



మున్సిపల్ సమావేశంలో ప్రశ్నలు అడుతున్న కౌన్సిలర్

- చైర్మన్ అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం
- చర్చకు వచ్చిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నియామక వివాదం

కల్వకుర్తి టౌన్: కొన్ని రోజులుగా మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆగడాలపై మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో చర్చకు వచ్చినట్లుగా తెలిసింది. బుధవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్మన్ సత్యం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభమైన వెంటనే పలు అంశాలను చర్చించారు. మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్‌లో ఎలాంటి దరఖాస్తులు వచ్చాయి, వాటి పురోగతి ఎలా ఉందన్న విషయాలను కౌన్సిలర్ సూర్య ప్రకాశ్ అడిగినట్లుగా తెలిసింది. అందుకు సంబంధించిన వివరాలను తెలియజేస్తామని చైర్మన్, అధికారులు సమాధానం చెప్పారని కౌన్సిలర్ తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మున్సిపాలిటీలో తను నిర్వర్తిస్తున్న భాగోతంపై కొంతమంది కౌన్సిలర్లు ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు వచ్చాయని కౌన్సిలర్ శ్రీను చెప్పారు. పత్రికలో వచ్చిన కథనాలు పట్టుకుని కౌన్సిల్ సమావేశంలో చర్చ చేయటం సరికాదని మాట దాటవేశారని చెప్పుకొచ్చారు. మీ వద్ద ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఏవైనా వసూళ్లు చేసినట్లుగా ఆధారాలు ఉంటే తీసుకొని రావాలని, అప్పుడు దాని గురించి ఆలోచన చేస్తామని విడ్డూరంగా మాట్లాడరని తెలిసింది.

ఉద్యోగి నియామకంపై చర్చ...

పట్టణంలో ఉన్నత చదువులు చదివిన చాలా మంది నిరుద్యోగులు ఉండగా.. ఎక్కడో హైదరాబాద్ ప్రాంతం నుంచి అతడిని తీసుకొచ్చి ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం కల్పించటం విడ్డూరంగా ఉందని ప్రశ్నించానని కౌన్సిలర్ శ్రీను తెలిపారు. కౌన్సిల్‌లోని ప్రముఖులు కలగజేసుకొని అతడిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉద్యోగంలో చేర్చుకున్నామని చెప్పారు. ఉద్యోగి నియామకంపై తీర్మానం ఎప్పుడు చేశారో అందుకు సంబంధించిన వివరాలను తెలియజేయాలని డిమాండ్ చేశారు.

భవిష్యత్తుపై ప్రమాదం...

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి చేస్తున్న నిర్వాకాలపై భవిష్యత్‌లో మాకు రాజకీయాలకు ప్రమాదకంగా మారే అవకాశముందని పలువురు కౌన్సిలర్లు వాపోతున్నారు. అధికారులు, ఇలాంటి ఉద్యోగులు కొన్ని రోజులు విధులు నిర్వర్తించి వెళ్లిపోతారని, వారు చేసిన ఇలాంటి పనులతో వార్డుల్లో రాజకీయ భవిష్యత్ లేకుండా పోతుందని అంటున్నారు. ఇలాంటి వసూళ్ల ఉద్యోగితో భవిష్యత్‌లో రాజకీయంగా చాలా ఇబ్బంది ఉంటుందని, కౌన్సిల్ సమావేశం ముగిసిన తర్వాత చర్చించుకోవటం పలు చర్చలకు తావిస్తుంది. ఇలాంటి అంశాలపై ఎమ్మెల్యే దృష్టి సారించాలని కౌన్సిలర్లు చర్చించుకున్నారు.

కల్వకుర్తిని సందర్శించిన ప్రత్యేకాధికారులు



కల్వకుర్తి రూరల్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని జీవనోపాధి వనరుల శిక్షణ కేంద్రాన్ని బుధవారం నేషనల్ ఇనిస్టిట్యూట్ రూరల్ డెవలప్‌మెంట్ అధికారుల బృందం సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ ఉపాధి హామీ పథకం అమలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులకు ఎంపీడీఓ ఆంజనేయులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

- కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

నాగర్‌కర్నూల్: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో తొమ్మిదో విడత ఆపరేషన్ ముస్కాన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. 18 సంవత్సరాల లోపు పిల్లలు ఎవరైనా ప్రమాదకర ప్రదేశాల్లో పని చేస్తుంటే, వారిని గుర్తించి రక్షించాలన్నారు. పనిచేయిస్తున్న యాజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చిన్నపిల్లలను ఎవరైనా వెట్టి చాకిరికి గురిచేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించే తొమ్మిదో విడత ఆపరేషన్ ముస్కాన్‌లో పోలీస్ బృందం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక శాఖ, సఖీ సెంటర్, విద్యాశాఖ, వివిధ శాఖలు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి బాలల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటాయన్నారు. సిబ్బందితో పాటు ప్రజలు సహకరించాలని సూచించారు.

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్..

బాలకార్మికులు, కిరాణాషాపుల్లో, మెకానిక్ షాపుల్లో, హోటళ్లలో పనిచేస్తూ.. రోడ్లపై వదిలివేయబడిన పిల్లలు, భిక్షాటన చేస్తున్న పిల్లలు ఉంటే గుర్తిస్తారని తెలియజేశారు. అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం, లేకుంటే స్టేట్‌హోంకు పంపిస్తామన్నారు. అధికారులు వారం రోజులకోసారి తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో ఇప్పటి వరకు చేపట్టిన 212 కేసుల్లో ఎంత మందిని ఏయే వసతిగృహాలకు పంపించారో మొత్తం రిపోర్ట్‌ను తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రామేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారిని వెంకటలక్ష్మి, చైల్డ్ ప్రొటెక్షన్ చైర్మన్ లక్ష్మణ్‌రావు, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీధర్, రవి, నిరంజన్, రామకృష్ణ, అనాథాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

కొత్త కలెక్టరేట్‌లో.. కొలువుదీరిన శాఖలు

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రం కొల్లాపూర్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలో వివిధ ప్రభుత్వ శాఖల వారీగా గదులను కేటాయించారు. జీ ప్లస్ టూ విధానంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనంలో ఏ కార్యాలయం ఎక్కడ ఉందో తెలుసుకోవడం కొంత కష్టమే. 2017 నుంచి నిర్మాణం చేపట్టిన నూతన కలెక్టరేట్ భవనం ఈ నెల 6న సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించి, జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. సుమారు 12.30 ఎకరాల్లో రూ.52.20 కోట్ల నిధులతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన నిర్మాణం చేపట్టారు. దాదాపు 99 గదులకు పైగా ఉన్న ఈ భవనాన్ని వివిధ బ్లాక్‌లతో వర్గీకరించారు. వాటిలో 42 శాఖలకు కేటాయింపులతో అన్ని శాఖలు సమీకృత కార్యాలయంలో కొలువుదీరాయి. కింది అంతస్తు జీ, మొదటి అంతస్తు యఫ్, రెండో అంతస్తు యస్‌లో గదుల కేటాయింపులు జరిపారు. మొత్తం 42 ప్రభుత్వ శాఖలు ఇందులోకి మారి పరిపాలన కొనసాగిస్తున్నాయి. ప్రవేశమార్గం నుంచి వస్తే ఏ శాఖకు ఎటువైపు వెళ్లాలో వివరిస్తూ.. బుధవారం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

కింది అంతస్తులో...

జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కింది అంతస్తు(గ్రౌండ్ ఫ్లోర్)లో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు గదుల కేటాయింపు జరిపారు. ఇందులో

- అంతస్తుల వారి వివరాలు

రూమ్ నంబరు జి 1లో జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయాన్ని, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయాన్ని, రూమ్ నంబరు జీ 2లో ఏటీఎం, జి 3లో షాప్, జి 4లో కార్మిక శాఖ, జిల్లా వయోజన విద్యతో పాటు తూనికల కొలతలు శాఖల కార్యాలయాలకు కేటాయించారు. రూమ్ నంబర్ జి 5ను ఎన్.ఐ.సీ జాతీయ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌గా, జి 6లో జిల్లా మహిళా శిశు సంక్షేమ దివ్యాంగులు వయోవృద్ధుల కార్యాలయానికి కేటాయించారు. రూమ్ నంబరు జి 7లో సర్వే, భూరికార్డుల అధికారి కార్యాలయం, రూమ్ నంబరు జి 8లో కలెక్టరేట్ ఈ, డి విభాగాల కోసం, జి 9లో కలెక్టరేట్ రికార్డ్ గది, రూమ్ నంబర్ 12, 13లో జిల్లా భూగర్భ జల శాఖ కార్యాలయం. రూమ్ నంబర్ 16 సర్వర్ రూమ్, 17 జిల్లా మైనింగ్ కార్యాలయానికి, రూమ్ నంబర్ 18 ఎలక్ట్రికల్ రూమ్, జి 19 జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఛాంబర్, జి 20 స్టోర్ రూమ్, రూమ్ నంబర్ 21 కలెక్టరేట్ విభాగాలు, 22 అటెండర్స్ రూమ్, 23 కలెక్టరేట్ పరిపాలన అధికారి ఏఓ ఛాంబర్, జి 24 కలెక్టరేట్ విభాగాలు, జి 25 స్టోర్ రూమ్, జి 26 అదనపు కలెక్టర్ రెవెన్యూ ఛాంబర్, జి 27 అదనపు కలెక్టర్ రెవెన్యూ సీసీ ఛాంబర్, జి 30 సర్వర్ రూమ్, జి 31 ఎలక్ట్రికల్ రూమ్, జి 32 స్టోర్ రూమ్, జి 33 గది కలెక్టరేట్ ఇన్‌వర్డ్ అవుట్ వార్డ్ జిల్లా ఎలక్షన్ విభాగం, జి 36 ప్రధాన మీటింగ్ సమావేశ మందిరం ప్రజావాణి హాల్, జి 37 జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చే ప్రజలకు వెయిటింగ్ హాల్, జి 38 అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల సీసీ ఛాంబర్, జి 39 అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల ఛాంబర్, జి 40 మినీ కాన్ఫరెన్స్ హాల్, జి 41 కలెక్టర్ పీఏ గది. జి 42లో కలెక్టర్ ఛాంబర్‌ను, ఇతర సదుపాయాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఒకటి రెండు అంతస్తులు ప్రత్యేక సమావేశ మందిరాలను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా జిల్లా పర్యటనకు వచ్చే మంత్రుల కోసం కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో ప్రత్యేకంగా గదులను కేటాయించారు.



సమీకృత కలెక్టరేట్ సముదాయం

మొదటి అంతస్తులో...

సమీకృత కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో ఎఫ్ 1వ నంబరు రూమ్‌ను జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డీఆర్‌డీఓ, స్త్రీ నిధి, స్టాఫ్‌కు, ఎఫ్ 2వ నంబరు గదిని కార్యనిర్వాహక ఇంజినీర్ మిషన్ భగీరథ అధికారి, ఎఫ్ 3, 4లను జిల్లా పంచాయతీ శాఖ అధికారి కార్యాలయానికి, 5ను జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి కార్యాలయం, ఎఫ్ 8లో జిల్లా పరిశ్రమల కార్యక్రమాలకు, ఎఫ్11లో ఎలక్ట్రికల్ పరికరాలకు, ఎఫ్12 నంబరు గదిని కాన్ఫరెన్స్ హాలుగా, ఎఫ్ 14, 15వ నంబరు గదిని జిల్లా విద్యాశాఖ అధికారి సమగ్ర శిక్షణ కార్యాలయానికి, ఎఫ్16 వంటగది, ఎఫ్ 17వ నంబరు గదిని, జిల్లా మద్య నిషేధ, అబ్కారీ శాఖకు, 18, 19వ నంబరు గదులను జిల్లా పౌర సరఫరాల శాఖకు, 25 నంబరు గదిని జిల్లా పే మరియు అకౌంట్స్ కార్యాలయం, జిల్లా ఖజానా శాఖ కార్యాలయానికి, 26వ నంబరు గదిని జిల్లా వ్యవసాయ, సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ శాఖకు, 27వ నంబరును జిల్లా గిరిజన అభివృద్ధి సంక్షేమ సంక్షేమ శాఖకు, ఎఫ్ 28వ నంబరును జిల్లా సహకార సంఘాల శాఖకు, ఎఫ్ స్టేట్ ఛాంబర్ జిల్లాకు వచ్చే మంత్రులు వినియోగించేందుకు కేటాయించారు.

రెండో అంతస్తులో..

సమీకృత కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో వివిధ శాఖలకు గదుల కేటాయించారు. రెండో అంతస్తులోని యస్ 1వ నంబరు గదిని జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి ఎస్సీ కార్పొరేషన్‌కు, యస్ 2, 3 నంబరు గదులను జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖకు, యస్ 4 గదిని మత్స్యశాఖ కార్యాలయానికి, యస్ 8 కాన్ఫరెన్స్ హాలుగా, యస్ 10 నంబరు గదిని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ కార్యాలయానికి, యస్ 13 14వ గదులను జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖకు, 15, 16వ నంబరు గదులను జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయానికి, యస్ 17వ నంబరు గదిని జిల్లా రోడ్లు మరియు భవనాల శాఖ కార్యాలయానికి, 18వ నంబరు గదిని జిల్లా పశువైద్య మరియు పశుసంవర్థక శాఖ అధికారి కార్యాలయానికి, 19, 20వ నంబరు గదులను జిల్లా ఆడిట్ అధికారి కార్యాలయానికి, 25వ నంబరు గదిని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖకు, 26, 27, 28వ నంబరు గదులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు కేటాయించారు. ఇప్పటి వరకు జిల్లాలో ఏ కార్యాలయానికి వెళ్లినా అక్కడ మరుగుదొడ్లు లేకపోవడంతో సాధారణ ప్రజలు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం నూతన కలెక్టరేట్ భవనంలో అవసరమైన ప్రాంతాల్లో టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. విశాలమైన రహదారులు, పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని శాఖల జిల్లా కార్యాలయాలన్నీ కొలువుదీరాయి.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


వెంకటేష్ (ఫైల్)

మన్ననూర్: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మంగళవారం రాత్రి సుమారు 12గంటల సమయంలో చోటు చేసుకుంది. అమ్రాబాద్ మండలం ప్రశాంతినగర్ (మన్ననూర్) గ్రామానికి చెందిన చిటుగోరి బాలయ్య కుమారుడు చిటుగోరి వెంకటేష్(24) కొంత కాలంగా హైదరా బాద్‌లో ఓ ప్రైవేటు వాహనం (కారు) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం స్వగ్రామం మన్ననూర్ వచ్చాడు. రాత్రి 9 గంటలకు తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా కడ్తాల గ్రామం సమీపంలో టిప్పర్ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో 108 అంబులెన్స్ సహాయంలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగానే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమో దు చేశామని కడ్తాల పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

వెల్దండ: మండల పరిధిలోని తిమ్మినోనిపల్లికి చెందిన అమరిశెట్టి రమాదేవి మెడలో ఉన్న దాదాపు నాలుగు తులాల బంగారు పుస్తెలు, గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లిన ఘటన బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు ఇలాఉన్నాయి. రమాదేవి, వరుసకు వదిన అయిన పద్మతో కలసి కల్వకుర్తి వెళ్లడానికి కొట్రగేట్ వద్దకు నడుచుకుంటూ వస్తున్నారు. అక్కడ ఉన్న ఓ వద్ద దొంగరోడ్డులో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి రమాదేవి మెడలో ఉన్న బంగారు పుస్తెల గొలుసును లాక్కొన్ని పారిపోయారు. దీంతో చోరీ జరిగిందని ఆమె బిగ్గరగా కేకలు వేసింది. కానీ వారు అప్పటికే పరారు కావడంతో ఫలితం లేకపోయింది. ఘటనలో ఆమె కింద పడడంతో స్వల్పగాయాలయ్యాయి. ఈ విషయంపై వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో బాధిత మహిళ ఫిర్యాదు చేశారు.

మిడ్జిల్ పరిధిలో...

మిడ్జిల్: వేముల గ్రామానికి చెందిన చెందిన బండారి లింగమ్మ గ్రామ శివారులోని వెల్జాల్ రోడ్డు పైన నిత్యం కల్లు విక్రయాలు చేపడుతుంది. అందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం సైతం విక్రయాల కోసం కూర్చుని ఉండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెల తాడును చోరీ చేశారు. ఆమె కేకలు వేసే లోపు పరారయ్యారు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఆచూకీ లభ్యం కాలేదని ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ తెలిపారు. కాగా పుస్తెల తాడు విలువ సుమారు రూ. 1.20 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపారు..

నాగర్‌దొడ్డిలో 40 ట్రాక్టర్ల ఇసుక సీజ్

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డిలో బుధవారం 40 ట్రిప్పుల ఇసుకను ఎస్‌ఐ శేఖర్ సీజ్ చేశారు. గ్రామ సమీపంలోని రిజర్వాయర్ నుంచి అక్రమంగా తరలించి కేశవులు అనే వ్యక్తి ఇంటి సమీపంలో నిల్వ ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని అక్రమంగా నిల్వ ఉంచిన 40 ట్రాక్టర్ల ఇసుకను రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేశారు.

పాలెంలో కంది విత్తనాలు

బిజినేపల్లి: పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పీఆర్‌జీ–176 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏడీఆర్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్‌జీ– 176 (ఉజ్వల)రకం విత్తనాలు కావాల్సిన రైతులు పాలెం ఆర్‌ఎఆర్‌ఎస్‌ను సందర్శించి కొనుగోలు చేయవచ్చని, విత్తనాలు కావాల్సిన రైతులు 88088 82766, 62811 21529 నంబర్లను సంప్రదిస్తే.. విత్తన నిల్వలపై మరింత సమాచారం అందుతుందని పేర్కొన్నారు.

‘ఇండోర్’ పనులు ముమ్మరం

- పాలమూర్‌లో రూ.7.79 కోట్ల వ్యయంతో అధునాతన మల్టీపర్పస్ స్టేడియం
- మెయిన్ స్టేడియంలో కొనసాగుతున్న పనులు
- సిద్ధమవుతున్న ప్రేక్షకుల గ్యాలరీ
- భవిష్యత్‌లో జాతీయ స్థాయి ఇండోర్ పోటీలకు అవకాశం


మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నమూనా

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి కృషితో ఉమ్మడి జిల్లాకే తలమానికంగా జిల్లా కేంద్రంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం జరుగుతోంది. ఇన్నాళ్లు ఈ స్టేడియం లేకపోవడంతో ఇండోర్ ఆటల్లో క్రీడాకారులు అంతగా రాణించలేకపోతున్నారు. అలాగే ఇతర టోర్నీలు నిర్వహిస్తున్నప్పటికీ, షటిల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాటోర్నీలకు అవకాశం లేకుండాపోయింది.

రూ.7.79 కోట్లతో సౌకర్యాలు..

మెయిన్ స్టేడియంలో రూ.7కోట్ల 79లక్షల వ్యయంతో అధునాతనమైన క్రీడా సౌకర్యాలతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులపై మంత్రి ఎప్పటికప్పుడు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. పనులు వేగంగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే గ్రౌండ్, రెండో ఫ్లోర్‌లో పెవిలియన్, ఇతర గదుల పనులు పూర్తి చేశారు. ఇండోర్ స్టేడియం పైకప్పు ఫిట్టింగ్ (ట్రస్సెస్) చేశారు. ఇండోర్ స్టేడియంలో లోపల క్రీడాపోటీలను తిలకించడానికి రెండు వైపులా గ్యాలరీలో సీట్లను అమర్చుతున్నారు. బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడలకు హాళ్లను ఏర్పాటు చేశారు. స్టేడియంలో కలర్ పనులతోపాటు ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్నాయి. త్వరలో సెంట్రలైజ్డ్ ఏసీ కండీషన్, ఆడియో సిస్టం, ఇతర పనులు చేపట్టనున్నారు. వీటికి సంబంధించి జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారులు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపారు.

క్రీడాకారులకు మెరుగైన వసతులు..

మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో అన్ని విధాలా క్రీడావసతులు ఏర్పాటు చేస్తున్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఇండోర్ స్టేడియం పూర్తయితే వెయిట్ లిఫ్టింగ్, జూడో, కబడ్డీ, ఇతర ఇండోర్ క్రీడలు ఆడే అవకాశం ఏర్పడుతుంది. అదే విధంగా షటిల్ బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టెన్నికాయిట్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడల్లో ఆడే క్రీడాకారులకు మంచి అవకాశాలు ఏర్పడనున్నాయి. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయస్థాయి ఇండోర్ క్రీడాపోటీలకు వేదికగా మారే అవకాశం ఉంది.


ప్రధాన స్టేడియంలో నిర్మాణమవుతున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం


ఇండోర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన సీట్లు

ముమ్మరంగా పనులు..



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషి వల్ల జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటవుతోంది. పనులు ముమ్మ రంగా సాగుతున్నాయి. క్రీడాకారులకు అన్ని రకాల వసతులు అందుబాటులోకి వస్తాయి. నిష్ణాతులైన కోచ్‌లు వస్తారు. ఇది అందుబాటులోకి వస్తే జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు తయారయ్యే అవకాశం ఉంది.
– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

చాలా సంతోషంగా ఉంది...



పాలమూరులో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటువుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. దీంతోపాటు పలు స్టేడియంల నిర్మాణమవుతున్నాయి. జిల్లాలో క్రీడాభివృద్ధి కోసం పాటు పడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వ్యాయామ ఉపాధ్యాయుల తరఫున ధన్యవాదాలు. ఈ స్టేడియం ఔత్సాహిక క్రీడాకారులకు ఒక వేదికలా మారనుంది. – వేణుగోపాల్, పెటా టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మహబూబ్‌నగర్

నేడు తొలి ఏకాదశి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు


జిల్లా కేంద్రంలోని కాటన్‌మిల్ ఆవరణలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి హైందవులకు ఇది మహాపర్వదినం. దీన్ని ‘శయనైకాదశి, ప్రథమ ఏకాదశి’ అని పిలుస్తారు. క్షీరాబ్ధిలో శేషపాన్పుపైన శ్రీమహావిష్ణువు శయనించడం వల్ల దీన్ని శయనైకాదశి అంటారు. ఏకాదశి రోజు శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైనది. మోక్షాన్ని ఇచ్చే మాసం ఆషాఢం. ఈరోజు నుంచి ఉత్తరం ఉన్న సూర్యుడు దక్షిణ దిశకు వాలుతున్నట్లుగా కనిపిస్తాడు. నేటి (గురువారం) నుంచి ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీకశుద్ధ ఏకాదశి వరకు ‘చాతుర్మాస్య వ్రతాలు’ పాటిస్తారు. ఏకాదశి 11 సంఖ్యకు సంకేతం. ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, మనస్సు వెరసి పదకొండింటిపైన నియంత్రణ కలిగి వ్రతం ఆచరించాలన్నది ఈ పండుగ సందేశం. ఈరోజు నుంచే పండుగలు ప్రారంభమవుతాయి. రాబోయే శ్రావణ మాసంలో మహిళలు ఆచరించే వ్రతాలు, నోములు బాద్రపద మాసంలో వినాయక నవరాత్రులు, దాని తర్వాత దేవీనవరాత్రులు, దసరా, దీపావళి ఇలా ఎన్నో పండుగలుకు ఈ చాత్మరుస్యం విశేషమైనది.

అభిషేకాలకు ప్రత్యేకం..

తొలి ఏకాదశికి దేవాలయాల్లో ఎక్కాహం, అభిషేకాలు చేపడుతారు. ఎక్కాహం అంటే 24 గంటల పాటు ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం ఎప్పుడైతే ప్రారంభిస్తారో మరునాడు అదే సమయం వరకు నిరంతరం భక్తి భజనలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తొలి ఏకాదశి పూజలకు పట్టణంలోని పలు ఆలయాలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సింహగిరిలోని లక్ష్మీ నరసింహ్మాస్వామి ఆలయం, రేణుకా ఎల్లమ్మ గుడి, పాత శివాలయం, బండ్లగేరి ప్రాంతంలోని శ్రీరుక్మిణీ పాండురంగ స్వామి ఆలయం, టీచర్స్ కాలనీ రామాలయం, పిల్లలమర్రి సమీపంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు పలు దేవాలయాల్లో నేడు తొలి ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎంతో విశిష్టత..



తొలి ఏకాదశికి ఎంతో విశిష్టత ఉంటుంది. ఏకాదశి రోజు విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత పారాయణం అత్యంత పుణ్యప్రదమైనది. ఈ ఆషాఢ మాసంలో విశేషంగా అనేక పండుగలు ఉంటాయి. ఈ చాతుర్మసం దేవతా పూజలకు నిలయమైనది. వచ్చే పండుగలకు ప్రారంభసూచిక తొలి ఏకాదశి.
– తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, కార్యనిర్వహణాధికారి, కంచికామకోటి పీఠం పాలమూరు శాఖ

నల్లమలలో పెరిగిన పెద్దపులుల సంఖ్య


అక్కమ్మబిలం వద్ద రోడ్డు దాటుతున్న పెద్ద పులి

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో పెద్ద పులుల సంఖ్య పెరగడంతో సంచారం అధికమైంది. నల్లమల ప్రాంతం గత 30ఏళ్ల పరిస్థితులను తలపించే విధంగా రోజూ ఎక్కడో ఒక ప్రాంతంలో పెద్దపులి సంచారం కనిపిస్తుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. సోమవారం రాత్రి శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి అక్కమ్మ బిలం వద్ద శ్రీశైలం వైపు జీపులో ప్రయాణిస్తున్న వారికి పెద్దపులి రోడ్డు దాటుతుండగా కనిపించిందని తెలిపారు. గంభీరమైన రూపంలో భారీ ఖాయంతో అతి సమీపంలోనే పెద్ద పులి కనిపించడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురైనట్లు తెలిపారు. జీపు లైట్ల వెలుతురుకు త్వరగా రోడ్డు దాటి అభయారణ్యంలోకి వెళ్లడంతో ఊపిరి పీల్చుకున్నామని అన్నారు. ఇదిలా ఉండగా వటువర్లపల్లి గ్రామ వ్యవసాయ పొలాలు, సమీప అటవీ ప్రాంతంలోనే రెండు మూడు పెద్దపులులు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు, ప్రయాణికులు తెలిపారు. అటవీ సరిహద్దు పరిసర ప్రాంతంలో వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబైలు గ్రామాలు, వ్యవసాయ పొలాలు ఉండటంతో ప్రజలు, కాడెద్దులపై దాడి చేసే ప్రమాదం ఉన్నందున సంబంధిత అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని పెద్దపులులను లోతట్టు అభయారణ్యంలోకి తరలించే ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

ఆరు టిప్పర్లకు రూ.1.50లక్షల జరిమానా

దేవరకద్ర: నారాయణపేట జిల్లా పరిధిలో తరలించాల్సిన ఇసుకను అక్రమంగా మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి తరలిస్తుండగా మంగళవారం సాయంత్రం పట్టుబడిప ఆరు ఇసుక టిప్పర్లకు ఒక్కోదానికి రూ.25 వేల చొప్పున రూ.1.50 లక్షల జరిమానాను విధించారు. మాగనూర్ రిచ్ పాయింట్ నుంచి నారాయణపేటకు అనుమతి పత్రాలతో తరలించాల్సిన ఇసుకను అక్రమంగా మహబూబ్‌నగర్‌కి తరలిస్తుండగా తహసీల్దార్ జ్యోతి వాటిని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. బుధవారం టిప్పర్ యజమానులు తెచ్చిన అనుమతిపత్రాలు నారాయణపేట జిల్లా పరిధిలోవి కావడంతో అక్కడి అనుమతులతో అక్రమంగా తరలిస్తున్నట్లు తేలడంతో ఆరు టిప్పర్లకు జరిమానా విధించారు.

- నారాయణపేట జిల్లాలో ప్రభుత్వ భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకుని ప్రతి రోజు టిప్పర్ల ద్వారా ఇసుకను రోజంతా నారాయణపేటకు తరలిస్తారు. చివరగా సాయంత్రం ట్రిప్పు ఇసుకను మహబూబ్‌నగర్‌కు తరలించి అక్రమంగా అమ్ముకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రతి రోజూ ఇలాగే జరుగుతుందనే సమాచారం.

జోగులాంబకు బంగారు పతకం


ఆలయ చైర్మన్, పాలక మండలికి అందజేస్తున్న బంగారు పతకం

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ అమ్మవారికి బుధవారం ఓ భక్తుడు రూ.7.60లక్షల విలువ చేసే బంగారు పతకాన్ని అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని కడప జిల్లాకు చెందిన దేవగిరి చంద్రమౌళీశ్వర రెడ్డి, ప్రభావతి దంపతులు 111 గ్రాముల బరువు ఉన్న బంగారు మహాకాళీ పతకాన్ని తయారు చేయించారు. వీటిని అమ్మవారి వద్ద ఉంచి పూజ చేయించి అనంతరం ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, పాలక మండలి ధర్మకర్తలు వెంకటనారాయణ రెడ్డి, ఆనంద్ శర్మలకు అందజేసినట్లు ఆలయ సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్ తెలిపారు. గతంలో కూడా ఈ దంపతులు అమ్మవారికి మరో బంగారు పతకాన్ని సమర్పించారు. విశేష సందర్భాల్లో వీటిని అలంకరించాలా లేక నిత్యం అమ్మవారికి అలంకరించాలా అనే అంశంలో ఆలయ అర్చకులతో మాట్లాడి పాలకమండలి తగు నిర్ణయం తీసుకుంటుందని తెలియజేశారు. దాతలను ఆలయ చైర్మన్, పాలక మండలి అభినందిస్తూ.. వారికి ప్రసాదాలు అందజేశారు.

చెంచుల జీవనంపై అధ్యయనం


చెంచులతో చర్చిస్తున్న శిక్షకుల బృందం

- వివరాలు సేకరించిన ఎన్‌ఐఆర్‌డీ శిక్షకులు
- అమలవుతున్న పథకాల తీరుపై చర్చ


చెంచు కుటుంబం వద్ద వివరాలు ఆరా తీస్తున్న ఎన్‌ఐఆర్‌డీ శిక్షకులు

బల్మూర్: ఒకప్పుడు అడవిలోనే గుడిసెలు ఏర్పాటు చేసుకుని సమాజానికి దూరంగా జీవించే చెంచులు, నేడు గ్రామాల్లో అందరితో పాటు నివసిస్తున్నారు. వారి జీవన విధానంపై అధ్యయనం చేయడానికి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఐఆర్‌డి) శిక్షకుల బృందం బుధవారం కొండనాగుల పంచాయతీలోని గుడిబండ చెంచు కాలనీని సందర్శించింది. కోఆర్డినేటర్ డాక్టర్ సత్య రంజన్ మహాకుల్ ఆధ్వర్యంలో అధికారులు చెంచు కుటుంబాలు, తొమ్మిది రాష్ట్రాల నుంచి వచ్చిన 55 మంది ఎన్‌ఐఆర్‌డి శిక్షకులతో సమావేశం నిర్వహించారు. చెంచు కుటుంబాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా లబ్ధి, మహిళా సంఘాల ఏర్పాటు వారికి అమలవుతున్న ప్రత్యేక పథకాలపై చెంచులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా పని కల్పిస్తూ, అడ్వాన్స్‌గానే డబ్బులు చెల్లిస్తుండటంతో వలసలు మానేశారని డీఆర్‌డీఓ నర్సింగరావు తెలిపారు. ఐదు బృందాలుగా ఏర్పడిన సభ్యులు చెంచుల ఇళ్ల వద్దకు వెళ్లి జీవన స్థితిగతుల గురించి తెలుసున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌ఐఆర్‌డీ శిక్షకుల బృందం కోఆర్డినేటర్ డాక్టర్ సత్యరంజన్ మహాకుల్, డీఆర్‌డీఓ నర్సింగరావు, అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి, డీఎల్‌పీఓ వెంకటయ్య, ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓ దేవన్న, ఎంపీఓ చంద్రశేఖర్, సర్పంచ్ రేవతి, చెంచుమహిళా సంఘం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మయ్య, టెక్నికల్ అసిస్టెంట్ మల్లేష్, ఏపీఎం చిట్టెమ్మ, ఏపీఓ సువర్ణ, ఐకేపి సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా కేసులో 6నెలల జైలు

వనపర్తి: ఇసుక అక్రమ రవాణా కేసులో నిందితులకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ.. బుధవారం జూనియర్ సివిల్ జడ్జి, సెకండ్ అడిషనల్ జేఎఫ్‌సీఎం జానకి తీర్పు వెలువరించినట్లు ఎస్పీ రక్షితా కె. మూర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు. 2016 జనవరి 29న రాత్రి వనపర్తి రూరల్ స్టేషన్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా.. కొత్తకోట రోడ్డులో మండలంలోని నాగమ్మ తండా ప్రాంతం నుంచి వచ్చిన లారీని తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించి లారీ డ్రైవర్ ఇంద్రయ్య, లారీ యజమాని కురుమూర్తిపై అప్పటి ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి కేసు నమోదు చేశారు. పలు దఫాలుగా వాదోపవాదనలు విన్న తర్వాత తీర్పు వెలువడింది. నిందితులకు శిక్ష పడేందుకు కృషిచేసిన వనపర్తి సెకండ్ అడిషనల్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీతా దేవి, సీఐ మహేశ్వర్ రావు, ఎస్‌ఐ నాగన్న, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ రాజేందర్‌లను ఎస్పీ అభినందించారు.

నెలక్రితం పెళ్లి.. అంతలోనే మృతి

- మృతుడు ఫార్మా పరిశ్రమలో సూపర్ వైజర్
- అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

జడ్చర్ల: నెల కిందటనే ఆ యువకునికి పెళ్లి అయ్యింది. అంతలోనే ఆకస్మికంగా చావు వార్త వినాల్సి వచ్చిందని కుటుంబసభ్యులు లబోదిబోమంటున్నారు. మండల పరిధిలోని పోలేపల్లి సెజ్‌లో విధులు నిర్వర్తిస్తున్న వినేష్(28) ఆకస్మికంగా అనుమానాస్పదస్థితిలో మరణించాడు. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు... మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తుల్జరాంపేటకు చెందిన వినేష్ గత ఏడాది కాలంగా పోలేపల్లి సెజ్‌లోని ఎవర్టోజెన్ ఫార్మా పరిశ్రమలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. గతనెల 11న వినేష్‌కు వివాహమైంది. పెళ్లి తర్వాత జడ్చర్లలోనే ఉంటూ విధులకు వెళ్తున్నాడు. ఈక్రమంలో సొంత ఊరు వెళ్లి, మంగళవారం జడ్చర్లకు వచ్చాడు. విధులకు హాజరయ్యారు. పనిలో ఉండగానే నోటిలో నురగలు కక్కుతూ మృతి చెందాడు. పరిశ్రమ నిర్వాహకులు గమనించే టప్పటికే మరణించినట్లు గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే వినేష్ మరణంపై పరిశ్రమ నిర్వాహకులకు సంబంధం ఉందని ఆరోపిస్తూ కొందరు పరిశ్రమ దగ్గర ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్‌ఐ ఖాదర్ సంఘటన స్థలానికి చేరుకుని విచారించి, పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని బాదేపల్లి ఆస్పత్రికి తరలించారు. వినేష్ మరణంపై తమకు అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని మృతుడి చిన్నాన్న లావుడ్య బాబ్యానాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

బక్రీద్‌కు పొట్టేళ్లు సిద్ధం

- ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజుకు ఏర్పాట్లు


పాలమూరులోని రహెమానియా ఈద్గా


మహబూబ్‌నగర్‌లో న్యూటౌన్ వద్ద పొట్టేళ్ల విక్రయాలు





స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం చివరి మాసమైన జిల్‌హిజ్జా 10తేదీన జరుపుకునే ఈ పండుగను ‘ఈదుల్ జుహా’ వ్యవహరిస్తారు. సామూహికంగా ముస్లింలు ఈద్గాకు వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజు చేయడం రివాజు. జిల్లావ్యాప్తంగా సర్వమానవ కల్యాణం కోసం నమాజు చేసి ప్రార్థనలు చేస్తారు. కాగా.. పండుగ సందర్భంగా గొర్రె పొట్టేళ్ల వికర్యాలు ఊపందుకున్నాయి. మహబూబ్‌నగర్‌లోని జామియ మసీదు నుంచి ఉదయం 8.00 గంటలకు ముస్లింలు సామూహికంగా గడియారం చౌరస్తా మీదుగా స్థానిక రహెమానియ ఈద్గా వద్దకు చేరుకొని 9 గంటలకు ప్రత్యేక ఈద్ నమాజ్ చేస్తారు. జామియా మసీదు ప్రధాన ఇమామ్ హాఫిజ్ ఇస్మాయిల్ ప్రత్యేక నమాజు ప్రార్థనలు చేయిస్తారు.

మజీదుల్లో ప్రత్యేక ఈద్ నమాజ్‌లు..

మహబూబ్‌నగర్‌లోని మజీదుల్లో ఈద్ నమాజ్‌కు ఏర్పాట్లు చేశారు. మక్కా మజీద్, మదీనా మజీద్, రైల్వేస్టేషన్ మజీదే ఓమర్, సిరాజుల్ ఉలుమ్ మజీద్, మజీదే షర్ఫి చమన్, షాసాబ్‌గుట్ట మజీద్, సూఫియ మజీద్, మునీర్ మజీద్, షంసు, అల్‌కౌసర్, అన్వారే మదీనా మజీద్‌లతో తోపాటు ఇతర మజీద్‌లలో బక్రీద్ ఈద్ నమాజ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఊపందుకున్న పొట్టేళ్ల విక్రయాలు

బక్రీద్‌లో ఖుర్బానీకి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. మూడు రోజుల పాటు పొట్టేళ్ల మాంసాన్ని పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంతో పాటు ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాల్లో నాలుగు రోజుల నుంచే విక్రయ కేంద్రాలు వెలిశాయి. ఈ ఏడాది పొట్టేళ్ల విక్రయాలు ఊపందుకున్నాయి. మరో రెండు రోజుల పాటు పొట్టేళ్ల విక్రయాలు జరగనున్నాయి. మహబూబ్‌నగర్‌లోని న్యూటౌన్, వన్‌టౌన్, క్లాక్‌టవర్, మార్కెట్, మదీనా మసీద్, షాసాబ్‌గుట్ట, రాయచూర్ రోడ్ తదితర ప్రాంతాల్లో పొట్టేళ్ల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖుర్బాని మూడు రోజులు ఉండడంతో పొటెళ్లను విక్రయానికి ఉంచారు. ఉమ్మడి జిల్లాలో ఈ మూడు రోజుల్లో 2 లక్షలకు పైగా పొట్టేళ్లకు విక్రయాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదే విధంగా పండుగకు సంబంధించి దుకాణాల్లో పండుగ ప్రత్యేక వంటకం షీర్ కుర్మ తయారీ కోసం ఉపయోగించే సేమియాలు, డ్రైఫ్రూట్స్‌లతో పాటు మిస్వాక్, ఇత్తర్ (సుగంధ ద్రవ్యాలు), సుర్మాలను కొనుగోలు చేశారు.